క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం విశాఖలోని ఎల్లమ్మఆలయం ప్రాంతానికి చెందిన బి.రాఘవేంద్ర గౌతమ్ పుష్కర్ అనే దాత రూ.లక్ష విరాళం ఇచ్చారు. సింహగిరిపై దేవస్థానం తరపున దాతకు అన్నదాన భవనంలో సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేశారు.

నేడు సత్తెమ్మతల్లి వార్షిక జాతర



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి సోదరి, అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమతల్లి వార్షిక జాతర ఆదివారం వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు తెలిపారు. అమ్మవారిని భక్తులంతా దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు. భక్తులకు ప్రసాద వితరణ చేయనున్నట్టు తెలిపారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ. 16.9 లక్షలు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో శనివారం దేవదాయ శాఖ తనిఖీదారు ఎ.జగన్నాథం పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. 23 రోజులకు గాను రూ.16 లక్షల 92 వేల 807 రూపాయల నగదుతో పాటు 5.2 గ్రాముల బంగారం, వెండి 165 గ్రాములు విరాళంగా వచ్చింది. అలాగే 31 యుఎస్ఏ డాలర్లు, 2 సింగపూర్ డాలర్లు హుండీ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.బోస్ వెల్లడించారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులతో పాటు దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, డీఎస్ ప్రసాద్, ఈ. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీ,ఎస్టీ ఎన్నికలకు 25 నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రస్తుత కార్యదర్శి కొల్లి దేముడు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 10 జరగనున్న భెల్ (హెచ్‌పీవీపీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం 25 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 5న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల అనంతరం 6వ తేదీన అభ్యర్థులకు గుర్తులను కేటాయించనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 162 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రస్తుత ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు తన అనుచరులతో భారీగా తరలి వచ్చి రిటర్నింగ్ అధికారి కె.పి.మిశ్రాకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించండి



ఉక్కు ఎల్‌డీసీ కూడలి వద్ద ప్రచారం చేస్తున్న పర్యావరణ నిర్వహణ ఉద్యోగులు

ఉక్కునగరం: ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని ఉక్కు పర్యావరణ నిర్వహణ విభాగం ఉద్యోగులు నినదించారు. జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విభాగం ఉద్యోగులు ఉక్కు ఎల్‌డీసి విభాగం వద్ద శనివారం ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగం అధికారులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడం, ప్లాస్టిక్‌ను నివారించడం వంటి చర్యలు ద్వారా పర్యావరణ సమతుల్యతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఫణికుమార్, బి. శ్రీనివాస్, కిషోర్‌చెన్న, ప్రవీణ్ మింజ్, డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహ జయంతి



శ్రీకృష్ణాపురంలోని నృసింహస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరితో పాటు శ్రీకృష్ణాపురంలోని నృసింహస్వామి విగ్రహం వద్ద శనివారం నృసింహ జయంతిని విశేషంగా నిర్వహించారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆవిర్భవించిన సాయం సంధ్యావేళ ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిపారు. తొలుత స్వామివారి మూలవిరాట్ చెంతన విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచకలశ స్నపనం, అర్చన నిర్వహించారు. అనంతరం క్షేత్రమహత్యంలో ఉన్న నృసింహ ఆవిర్భావ ఘట్ట పురాణ విన్నపం చేశారు. స్వామికి విశేషంగా హారతులు అందజేశారు. వేదమంత్రోచ్ఛరణలతో స్వామిని కొలిచారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు పూజలను నిర్వహించారు.

శ్రీకృష్ణాపురంలోని నృసింహ వనంలో శనివారం నృసింహ జయంతిని దేవస్థానం వైదికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపై ఉన్న భారీ నృసింహ స్వామి విగ్రహం, ప్రహ్లాదుడి విగ్రహం వద్ద పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం సాయం సంధ్యావేళ ఆవిర్భావ ఘట్ట విన్నపాన్ని చేశారు. తదుపరి స్వామివారి అష్టోత్తర పూజ నిర్వహించారు. నమో నారసింహ అంటూ స్వామికి విశేషంగా హారతులిచ్చారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాని దినేష్‌రాజ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

- సీఐ రంగనాథం



చిన్నయ్యపాలెం వద్ద రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రంగనాథం

సబ్బవరం: రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ పి. రంగనాథం సూచించారు. మండలంలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న చిన్నయ్యపాలెం సంత వద్ద శనివారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రంగనాథం మాట్లాడుతూ చిన్నయ్యపాలెం సంత వద్ద రైతులు, స్థానికులు జాతీయ రహదారిపై ,సర్వీస్ రోడ్డులో డివైడర్స్ వద్ద ఉన్న గ్రిల్స్ తొలగించి రోడ్డు దాటడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రైతులు సంతకు రాకపోకలు నిర్వహించేందుకు అండర్ పాత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా అనుసరించాలని కోరారు. అదే విధంగా గ్రామాల్లో మద్యం అక్రమ అమ్మకాలు,గంజాయి రవాణా.. వినియోగించినా.. అనుమతులు లేకుండా బాణ సంచా తయారీ చేసినా, కోడిపందాలు, పేకాట నిర్వహించినా తమకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎల్ సురేష్ తో పాటు పోలీస్ సిబ్బంది, పలువురు రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తండ్రికే కొడుకు టోకరా

- న్యాయం చేయాలని ఏఆర్ఎస్ఐ వేడుకోలు



ఏఆర్ ఎస్ఐ దొంగబాబు నుంచి వివరాలను తెలుసుకుంటున్న సీఐ విజయ్‌కుమార్

మద్రిపాలెం: ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న తనకు అన్యాయం జరిగిందంటూ కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు కాపారపు దొంగబాబు తన గోడు వినిపించారు. వివరాలిలా.. బాపూజీనగర్ అంబేడ్కర్ కాలనీలో నివసిస్తున్న దొంగబాబుకు కొంతకాలం కిందట జరిగిన ఓ ప్రమాదంలో కాలు పోయింది. ఆయనతో అతడి కుమారుడు కొంత మొత్తం నగదు కోసం లోన్ పెట్టించాడు. కృత్రిమ కాలు పెట్టిస్తానని, విశాలాక్షినగర్‌లో వ్యాపారం కోసం షాపు పెట్టుకుంటానని, దానికి ష్యూరిటీ పెట్టమని తండ్రితో చెక్కుపై సంతకం పెట్టించుకున్నాడు. అంతటితో ఆగకుండా దఫదఫాలుగా తండ్రి ఖాతా నుంచి నగదు డ్రా చేసి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేశాడు. ఈ క్రమంలో శనివారం ఏఆర్ ఎస్ఐ దొంగబాబు ట్రైసైకిల్‌పై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. సంగతి తెలుసుకున్న సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేరుగా బాధితుడి వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. పై అధికారులతో మాట్లాడి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధితుడు తన కొడుకు, కోడలిపై ఫిర్యాదు చేశారు. కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

842వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోవాలన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 842వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని ప్రకటనలు చేయడం సరికాదన్నారు. పోరాటం చేయడం రాష్ట్ర ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామికి చక్రస్నానం



స్వామి చక్రస్నానం నిర్వహిస్తున్న రుత్విక్కులు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి విశేష ఆరాధన, నిత్య హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ బేడా ప్రదక్షిణ జరిపారు. తర్వాత స్వామికి అవబృదోత్సవం, స్వామికి చక్రస్నానం జరిపారు. అనంతరం స్వామికి పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

మరో గ్రంథాలయ ఉద్యమం అవసరం



బైకు యాత్రికుడు వెంకటేశ్వర్లును అభినందిస్తున్న డి.వి.సూర్యారావు, సాహితీవేత్తలు

సీతంపేట: గ్రంథాలయాల పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా బైకుపై సంచరిస్తున్న ఒంగోలుకు చెందిన మంచికంటి వెంకటేశ్వర్లు శనివారం ఉదయం నగరానికి చేరుకున్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయానికి వచ్చిన ఆయనకు లైబ్రరీ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒంగోలులో బయలుదేరి రాయలసీమ అంతా పర్యటించి, కోస్తా జిల్లాల మీదుగా ఉత్తరాంధ్రకు వచ్చానని తెలిపారు. గ్రంథాలయాల పరిరక్షణ, అభివృద్ధికి మరో గ్రంథాలయ ఉద్యమం అవసరమన్నారు. ప్రజల వద్దకు పుస్తకం తన నినాదమని, సొంత డబ్బుతో పుస్తకాలు ముద్రించుకునే వారు లేక కొంత మంది రచయితలు నిరాశ, నిస్పృహలో ఉన్నారన్నారు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, వదాన్యులు, సేవా తత్పరులు గ్రంథాలయాలను ప్రోత్సహించాలని కోరారు. పాఠశాలల్లో గ్రంథాలయాలు పిల్లలకు దేవాలయాలని అభివర్ణించారు. రచయితల కోసం సహకార వేదికలు ఏర్పాటు కావాలని సూచించారు. తన పర్యటనలో అనుభవాలను వివరించారు. విశాఖ పౌర గ్రంథాలయం ప్రగతి అభినందనీయని, ఇతర ప్రాంతాల వారికి ఇది ఒక మంచి నమూనాగా పేర్కొన్నారు. మిత్ర సాహితి వర్మ, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మస్తాన్‌రెడ్డి, విశాలాంధ్ర బుక్ హౌస్ రాజు, కత్తి పద్మ తదితరులు వెంకటేశ్వర్లును అభినందించారు.

జాతీయ ఈత పోటీలకు ఎంపికైన విద్యార్థికి అభినందన



జాతీయ ఈత పోటీలకు ఎంపికైన నిఖిల్‌ప్రకాష్

పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈ నెల 6 నుంచి 12 వరకు నిర్వహించనున్న జాతీయ ఈత పోటీలకు పరవాడ దరి పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో 12 తరగతి చదువుతున్న విద్యార్థి ఎస్.నిఖిల్ ప్రకాష్ ఎంపికయ్యాడు. తిరుపతిలో స్కూల్ గేమ్స్ ఫెడరేష న్ ఆధ్వర్యంలో జనవరిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 400 మీటర్ల ఫ్రీస్టైల్, 200 మీటర్ల బట్టర్ ఫ్లై ఈత పోటీల్లో రజిత పతకం సాధించి అండర్-19 విభాగంలో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి చెప్పారు. స్విమ్మింగ్ కోచ్ మధుబాబు వద్ద తర్ఫీదు పొందుతున్నాడు. ప్రకాష్ ను అభినందిస్తూ పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి రూ. 5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సీఈవో నిశాంత్, కోచ్‌లు హరినాథ్‌రెడ్డి, బషీర్, కోఆర్డినేటర్ రామలక్ష్మి ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

మత్స్యకారులకు ప్రత్యేక శిక్షణ



శిక్షణ పొందిన మత్స్యకారులతో అధికారులు

మహారాణిపేట : సముద్రంలో ప్రయాణించే మత్స్యకారులు అత్యవసర పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణాలు రక్షించుకోవచ్చని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ పేర్కొన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మత్స్యకారులకు బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్) అంశంపై నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శనివారం కొత్తజాలారిపేట గంగాదేవి ఆలయ ప్రాంగణంలో 50 మంది మత్స్యకారులకు నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంటు బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) ఆర్థిక ప్రోత్సాహంతో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న వారికి ఆస్ట్రేలియన్ లైఫ్ సేవింగ్ అకాడమీ (ఏఎల్ఎస్ఏ) సర్టిఫికెట్లు అందజేసింది. మూడు రోజుల శిక్షణలో పాల్గొన్న వారికి రోజుకు రూ.300 రూపాయలు చొప్పన వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు జేడీ విజయ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ డైరెక్టర్ భరత్, సీనియర్ ట్రైనర్ బాలు, కొండలరావు, వివిధ మత్స్యకార సంఘాల నాయకులు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు విజయకృష్ణ, మత్స్యశాఖాభివృద్ధి అధికారి డి.మురళి, మత్స్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి వ్యవస్థాపక దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ మహంతి

అగనంపూడి: అగనంపూడిలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి మరియు పరిశోధనా కేంద్రం 9వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉక్కు డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మహంతి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన క్యాన్సర్ బాధితులకు ఆస్పత్రి సేవలు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందన్నారు. ఆస్పత్రి డైరెక్టర్ మహంతి శెట్టి మాట్లాడుతూ ఆస్పత్రిలో వంద పడకలతో పాటు రోగుల సహాయకులకు ప్రత్యేక వసతి కల్పించడం జరిగిందన్నారు. ఏడు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, డే కేర్ కీమో థెరపీ, బయో కెమికల్, పెథాలజీ, మైక్రో బయోలజీ, మెమోగ్రాఫ్, సిటీ స్కానర్లు, పీఈటీ స్కానర్లు, దంత ఫిజియోథెరపీ, పాలియేటివ్‌కేర్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆస్పత్రి ఆవరణలో ఆదివారం లైవ్ సర్జికల్ అండ్ బేసిక్ సూటరింగ్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే జన్ భాగీదరి



వంగలి పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈవో అప్పలరాజు

సబ్బవరం: మండలంలోని వంగలి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జి-20 జన్ భాగీదరి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేపీహెచ్ ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎస్.అప్పలరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు భాష, గణిత మేళాలు దోహదపడతాయన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ నెల 6వ తేదీన జరిగే జిల్లా స్థాయి ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ లగిశెట్టి దేముడుబాబు, ఉప సర్పంచ్ గొర్లి అప్పలనాయుడు, గ్రామ పెద్దలు ఆకుల గణేష్,గవర రాజు,ముదపాక శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న షిప్‌యార్డ్ అధికారి గుప్తా

సింధియా: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర రక్షణ శాఖ ఆదేశాల మేరకు హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఆధ్వర్యంలో మే 20వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం కార్మికులంతా కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. షిప్‌యార్డ్ మెయిన్ గేటు వద్ద ప్రారంభమైన సైకిల్ ర్యాలీ వాల్‌చంద్ గేట్, సింధియా గేట్ నుంచి మల్కాపురం పోలీస్‌స్టేషన్ వరకు సాగి తిరిగి షిప్‌యార్డ్ మెయిన్ గేట్ వద్ద ముగిసింది. ఈ సైకిల్ ర్యాలీని షిప్‌యార్డ్ డైరెక్టర్ కార్పొరేట్ అండ్ ప్లానింగ్ అధికారి జేపీ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు వారంలో ఒక్కరోజైనా మోటారు వాహనాలు వీడి సైకిల్‌పై విధులకు హాజరు కావాలన్నారు. కార్మికులు ఆరోగ్యంతో పాటు పర్యావరణం మీద అవగాహన కలిగి ఉండాలని, ప్లాస్టిక్ రహిత, కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఉన్నాతాధికారులు, గుర్తింపు యూనియన్ నాయకులు, ఉద్యోగులు, షిప్‌యార్డ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న సర్పంచ్ బోను దేవుడమ్మ

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో రావాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా గ్రామ దేవత అమ్మవారి ఆలయ విసర్జన పనులు నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకుడు ఆరాధ్యుల సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బోను దేవుడమ్మ, గంగునాయుడు దంపతులు, గ్రామ పెద్దలు గండి దేముడు,పైడితల్లమ్మ దంపతులు,గణేష్,దేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని తాత్కాలిక ఆలయంలోకి తరలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్లి కనకరాజు, మాజీ సర్పంచ్ కొటాన సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో మొక్కలు నాటిన అధికారులు



ఉక్కు జనరల్ ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటుతున్న డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శనివారం సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉక్కు ఆగ్రోఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో ఉక్కు జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా ఉత్పత్తికి తగ్గట్టు మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యతకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సుమారు 400 కొబ్బరి, సపోటా, జామ మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఆర్ సీజీఎంలు జి. గాంధీ, వై. చంద్రశేఖర్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఏడుగురు కానిస్టేబుళ్లు

సబ్బవరం: సాధారణ బదిలీల్లో భాగంగా సబ్బవరం పోలీస్టేషన్కు ఏడుగురు కానిస్టేబుల్లు బదిలీపై వచ్చి విధుల్లో చేరినట్టు సీఐ పి. రంగనాథం తెలిపారు. విధుల్లో చేరిన వారిలో జి. శ్రావణ్ కుమార్(చీడికాడ స్టేషన్), సీహెచ్ రామకృష్ణ(అనకాపల్లి ట్రాఫిక్), పి. వెంకటరావు (యలమంచిలి), ఎం. రాము(పరవాడ), బి. లక్ష్మి (పరవాడ), హెడ్ కానిస్టేబుల్ వీవీఆర్ మూర్తి(నర్సీపట్నం టౌన్), హెచ్‌సీ జి. గోవిందరావు (కోటవురట్ల) ఉన్నారు. సబ్బవరం స్టేషన్ నుంచి హెచ్‌సీలు కె. వెంకటరమణ, జి. ఉమామహేశ్వరరావు, పీసీలు పి. శివకుమార్, సీహెచ్ శ్రీనివాసరావు, బీడీ నాయుడు, పి. గౌతమ్, ఎల్. శకుంతల వివిధ స్టేషన్లకు బదిలీ అయ్యారని సీఐ తెలిపారు.

వాడచీపురుపల్లిలో వైద్య శిబిరం నేడు

పరవాడ: వాడచీపురుపల్లిలో ఏడీఎన్ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం రామాలయం సమీపంలోని కల్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరంలో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహిస్తారు. ఉచితంగా మందులు అందజేస్తారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

సరుగుడు మొక్కలకు దరఖాస్తుల స్వీకరణ

పరవాడ: సరుగుడు మొక్కలు అవసరమైన రైతులు తమ పేర్లను గ్రామ సచివాలయంలో నమోదు చేసుకోవాలని ఉద్యాన అధికారులు తెలిపారు. సాధారణ రకానికి చెందిన సరుగుడు మొక్కలకు పేర్లు నమోదు చేసు కొన్న నెల రోజుల తర్వాత నర్సరీ నుంచి తీసుకెళ్లవచ్చునని చెప్పారు. సబ్బవరం, కశింకోట, కోటపాడు ప్రాంతాల్లోని నర్సరీల నుంచి సొంత ఖర్చులపై రైతులు సరుగుడు నారు పొందవచ్చునని, ఎకరానికి 4 వేల మొక్కలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయం

డాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి ఎం.శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. కౌన్సిల్ సభ్యులు, ప్రతినిధులకు క్రమశిక్షణ తప్పనిసరని పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విధుల నిర్వహణకు సంబంధించి కౌన్సిల్ సభ్యులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాధితులపై కౌన్సిల్ సభ్యులు బెదిరింపులకు పాల్పడితే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు. మానవ హక్కుల కౌన్సిల్ వలంటీర్లు తమకు తామే జవాబుదారీగా, నిజాయితీగా ఉండాలని, హక్కుల పరిరక్షణకు కట్టుబడి పని చేయాలన్నారు. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్. కోటలో వెయ్యికి పైగా మొక్కలు నాటనున్నట్టు శ్యాంప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌వీ రమణ, సూర్య, శ్రీనివాస్, ప్రసాద్, సీనియర్ సభ్యుడు గుండు అప్పలరాజు పాల్గొన్నారు.